క్లుప్తంగా

లారీ డ్రైవర్ల ధర్నా

చర్ల: మండలంలోని సుబ్బంపేటలో ఉన్న ఇసుక క్వారీలో లోడింగ్ కోసం వచ్చిన లారీలలో నిర్వాహకులు సకాలంలో లోడ్ చేయడం లేదని ఆరోపిస్తూ లారీ డ్రైవర్లు ఆదివారం ధర్నా నిర్వహించారు. చర్ల–సుబ్బంపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నిర్వాహకుల తీరును నిరశిస్తూ నినాదాలు చేశారు. పరిమితికి మించి ఇసుక లోడ్ చేసుకుంటేనే లోడ్ చేస్తామంటున్నారని, దీనివల్ల ఆర్టీఏ, ఇతర శాఖల అధికారులు కేసులు రాస్తూ జరిమానాలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాని నిర్వాహకులు మాత్రం అదనపు డబ్బుల కోసం అదనపు లోడ్ వేస్తున్నారని, నిరాకరిస్తున్న తమకు ఇసుక లోడ్ చేయడం లేదని వారు ఆరోపించారు. ఈ విషయంలో టీఎస్ఎండీసీ అధికారులు జోక్యం చేసుకొని తమ ఇబ్బందులు తొలగించాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

'ఆర్టీసీ తీరు అభ్యంతరకరం'

భద్రాచలంఅర్బన్: మహాలక్ష్మి పథకం మొదటి రోజు మహిళలకు పూలతో స్వాగతం పలికి అట్టహాసంగా ప్రారంభించారని, కొద్ది రోజులకే కొత్త, కొత్త నిబంధనలతో ఉచిత ప్రయాణం కాస్త కష్ట ప్రయాణంగా మార్చేస్తున్నారని ఐద్వా జిల్లా నాయకురాలు బెల్లంకొండ కుసుమ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో చెయ్యి ఎత్తినచోట ఆపి బస్సులోకి అనుమతినిచ్చే ఆర్టీసీ సిబ్బంది.. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన అనంతరం మహిళలను చూస్తేనే అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మహాలక్ష్మి పథకం వర్తించిన ప్రతి బస్సుకీ రిక్వెస్ట్ స్టాపులను పునరుద్ధరించడంతోపాటు మహిళలకు కేటాయించిన సీట్లలో వారిని కూర్చునే విధంగా సిబ్బంది కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు, మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలోని నివాసంలో ఎమ్మెల్యేను కలసి పలు సమస్యలు వివరించారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించి, కార్మికుల వేతనాలను రూ.10వేలకు పెంచాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కార్మికులు ఈశ్వరమ్మ, జ్యోతి, కృష్ణవేణి, దేవి, సుజాత, యామిని పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలపై..

అశ్వాపురం: మండలంలో ముస్లిం మైనార్టీలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కోఆప్షన్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.ఖదీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే నివాసంలో ముస్లిం మైనార్టీ యువత పాయంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. మండలంలో ప్రధానంగా షాదీఖానా స్థలం, షాదీఖానా నిర్మాణం, ఈద్గాకు ప్రహరీ నిర్మించాలని కోరారు. స్పందించిన పాయం.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఖదీర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కె.బాజీబాబా, ఎస్‌కె.హుస్సేన్, ఎస్‌డీ.సర్వర్, సాహెబ్, నాగుల్‌మీరా, షారూక్‌పాషా, చాంద్‌పాషా, నజీర్, ఫయాజ్ హుస్సేన్, రఫీ, అఫ్రోజ్, హబీద్‌పాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుల ఎన్నిక


అశ్వారావుపేటరూరల్: ఆర్యవైశ్య సంఘం అశ్వారావుపేట మండల అధ్యక్షుడిగా తిరుమలకుంట గ్రామానికి చెందిన శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వాసవీ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఆర్యవైశ్యుల సమావేశాన్ని కొనిజర్ల ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం సంఘం మండల, పట్టణ నూతన కమిటీలను ఎన్నుకోగా.. మండల నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత పట్టణ కమిటీకి లోకనాథ్ గుప్తా 55 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైనా అధ్యక్షులను సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దారా మల్లికార్జునరావు, ఎస్.వెంకటేశ్వరరావు, కోరుకొండ రామ్మోహనరావు, సంకా ప్రసాద్, తోకల హరిష్ గుప్తా, ముత్తా సుమాకర్, గుడివాడ కృష్ణ పాల్గొన్నారు.

సీఐటీయూను గెలిపించండి

మణుగూరురూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో అవినీతి అవకాశవాదులను ఓడించి కార్మికుల పక్షాన నీతి నిజాయితీతో పని చేసే సీఐటీయూని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.బ్రహ్మాచారిలు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మణుగూరు ఏరియాలో నిర్వహించిన ప్రచారంలో వారు మాట్లాడారు. కార్మికుల హక్కులు, సంస్థ పరిరక్షణ కోసం ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి సీఐటీయూని గెలిపించాలని వారు కోరారు. శ్రీను, టీవీఎంవీ ప్రసాద్, నందం ఈశ్వర్‌రావు, ఎం.లక్ష్మణరావు, విల్సన్, సుమన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

- విద్యుత్ అలంకరణలతో ధగధగలు
- స్టార్లు, క్రిస్మస్ ట్రీల ఏర్పాటు



అశ్వారావుపేటరూరల్: విద్యుత్ దీపాలతో క్రిస్మస్ పండుగకు ముస్తాబైన సీఎస్ఐ చర్చి


భద్రాచలంటౌన్: విద్యుద్దీపాల అలంకరణతో సీఎస్ఐ చర్చి

అశ్వారావుపేటరూరల్: క్రిస్మస్ పండుగ వేడుకలకు చర్చిలు, ప్రార్థనా మందిరాలను అందంగా ముస్తాబు చేశారు. నేడు జరిగే పండుగ వేడుకలకు అంతా సిద్ధం చేశారు. చర్చిలకు రంగులు వేసి , విద్యుత్ దీపాలతో అలంకరించారు. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్‌లో ఉన్న సీఎస్ఐ చర్చి, ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఉన్న సియోను ప్రార్థన మందిరం, ఖమ్మం రోడ్‌లోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న హోసన్న మందిరం, అటెండర్స్ కాలనీలోని గుడ్ న్యూస్ స్కూల్ చర్చితోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రార్థన మందిరాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదే విధంగా చర్చిల వద్ద స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేయడంతో పండుగ కళ సంతరించుకుంది. క్రైస్తవులంతా క్రిస్మస్ స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలను కొనుగోలు చేసి, వాటిని చర్చిల వద్ద, ఇళ్ల దగ్గర ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్‌లో కూడా పండుగ సందర్భంగా దుకాణాలు కళకళలాడుతున్నాయి.

భద్రాచలంటౌన్: క్రిస్మస్ వేడుకలతో భద్రాచలం పట్టణంలోని క్రైస్తవ మందిరాలు విద్యుత్ దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. బస్టాండ్ వెనుక బ్యాంక్ రోడ్‌లోని సీఎస్ఐ చర్చిని, చర్ల రోడ్‌లోని చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని పలు కాలనీల్లోని ప్రార్థన మందిరాలను దీపాలు, బెలూన్లు, రంగురంగు కాగితాలతో అలంకరించారు. ఆదివారం రాత్రి నుంచే ఏసు ప్రభువు ప్రార్థనలు, ఆరాధనలు ప్రారంభించారు.



అశ్వారావుపేటరూరల్: చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్‌లు


అశ్వారావుపేటరూరల్: విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

రెడ్డి కులస్తుల అభివృద్ధికి కృషి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరురూరల్: రెడ్డి కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయనుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క–సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో రెడ్డి సంక్షేమ సమాఖ్య వనభోజన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రెడ్డి కులస్తులు అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి, రాష్ట్ర రెడ్డి సంఘాల అధ్యక్షుడు బొక్క భూపాల్‌రెడ్డి, రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్ రెడ్డి, కంది రామచంద్రారెడ్డిలు మాట్లాడారు. అనంతరం రెడ్డి సంక్షేమ సమాఖ్య మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నాసిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా ఆలేటి అశోక్‌రెడ్డి, కోశాధికారిగా గాయం అవినాష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ముల్లంగి శివారెడ్డి, ఉడుముల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, సరెడ్డి రాఘవరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, శ్యామల కొండరెడ్డి, సామా వెంకటరెడ్డి, కొముదెల్లి నర్సిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా మేరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్యామల అశోక్‌రెడ్డి, సామా శ్రీనివాస్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, తమటం గురుబ్రహ్మరెడ్డి, ఆర్గనైజర్ కార్యదర్శులుగా దేవిరెడ్డి ఆదిరెడ్డి, కోటా రామ్‌రెడ్డి, పి.మాధవరెడ్డి, నాగిరెడ్డి, ఆవుల ప్రతాప్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్‌గా సామా శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, పప్పుల వెంకటేశ్వరరెడ్డి, సానికొమ్ము వెంకటరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మహిళలు, చిన్నారుల ఆటపాటలు అందరిని అలరించాయి. అనంతరం ఎమ్మెల్యే పాయంను, రాణి రుద్రమరెడ్డి, ఇతర అతిథులను రెడ్డి సమాఖ్య నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సమాఖ్య నాయకులు, రెడ్డి కులస్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి

ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పీవీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో తన గెలుపునకు కార్మికులు అందించిన సహకారంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు, కార్మికులకు అన్నివేళలా అందుబాటులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడే ఐఎన్‌టీయూసీని సింగరేణి ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, నామా వెంకటేశ్వరరావు, సోమరాజు, ఐఎన్‌టియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, రాజలింగు, కరుణాకర్, కృష్ణచేతన్, పెద నాగయ్య, కరీమ్, శివకుమార్, ప్రతాప్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

'పెసా'ను పకడ్బందీగా అమలు చేయాలి

ములకలపల్లి: 'పెసా'చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తొమ్మిది గిరిజన తెగల సమన్వయకర్త సోయం కన్నారాజు డిమాండ్ చేశారు. 24 డిసెంబర్ 1996న పెసా చట్టం అమలులోకి వచ్చిన సందర్భంగా.. మండలకేంద్రంలోని గుడ్‌షఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆవరణలో 'ఆదివాసీ జీవనం విధానం'ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన పెసా చట్టం.. పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా రోజురోజుకీ నీరుగారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. తొలుత చట్టం వచ్చిన రోజున రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఆదివాసీ జీవన విధానం ఫౌండర్ క్రాంతి, సోయం చిన్నారి, ఛత్తీస్‌గఢ్ ప్రతినిధులు సోయం నగేశ్. ప్రకాశ్, చుక్కా, ఊకే ముక్తేశ్వరరావు, బాడిశ భిక్షం, తాటి రవి తదితరులు పాల్గొన్నారు.

గుండాల: పెసా చట్టాన్ని నిర్వీర్యం చేయడం సరైంది కాదని, ఆందోళనకారులపై దాడులు చేయడాన్ని ఖండించాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు.

24 డిసెంబర్ 1996న పెసాను ఆమోదించడం ద్వారా గ్రామ పంచాయతీ వ్యవస్థ గ్రామసభలుగా రూపాంతరం చెందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పెసా చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ గ్రామసభల పూర్తి అధికారాన్ని పంచాయతీ కార్యదర్శి ఆధీనంలోకి తెస్తున్నాయని తెలిపారు. దీంతో గ్రామ సభలు అర్ధరహితంగా మారి ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. మరోవైపు, అటవీ సంరక్షణ చట్టాన్ని అమలు చేయడం కోసం మోదీ ప్రభుత్వం పెసాను రద్దు చేసి అటవీ హక్కులను స్థానికుల నుంచి లాగేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాటాలు చేస్తున్నవారిపై లాఠీలు ఝులిపించి జైలు పాలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

చర్లలో ఎమ్మెల్యే పర్యటన


ఎమ్మెల్యే వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న స్థానిక మహిళలు

చర్లరూరల్: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం చర్ల మండలంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్ రామయ్యనగర్‌లో గత 20 సంవత్సరాలుగా కరెంటు లేదని, తమ ప్రాంత సమస్యను తీర్చాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి.. విద్యుత్ సమస్య తీరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, నాయకులు ఎస్‌డి.అజీజ్, చింతా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

ములకలపల్లి: గొత్తికోయ గ్రామాలకు చెందిన పలుకుటుంబాలు ఐఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాబిన్‌హుడ్ ఆర్మీ సహకారంతో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. వలస ఆదివాసీ గ్రామాలైన సాకివాగు, తోగ్గూడెం, చింతగుప్ప, రాచన్నగూడెం, ఏనుగు అప్పయ్యనగర్, కొమరంభీం నగర్ గ్రామాల్లో ఆదివాసీలకు రగ్గులను అందజేశారు. సంస్థ బాధ్యులు రాజ్‌కుమార్, బషీర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ వ్రతం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న దాసాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ హనుమాన్ వ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాలాచార్యుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున మూడున్నర గంటలకు స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, అలంకరణ సింధూర లేపనము అప్పలమాల, వడమాల, తమలపాకుల మాలతో స్వామివారి అలంకరణ చేపట్టారు. ఉదయం 9:30 గంటల నుండి 11 గంటల వరకు హనుమాన్ వ్రతం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదం, తోరణం, కంకణం స్వీకరించారు.

27న బార్ అసోసియేషన్ సమావేశం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం ఈ నెల 27న జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద ఉదయం 10.30లకు నిర్వహించనున్నట్లు భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా దేవదానం తెలిపారు. భద్రాచలం బార్ అసోసియేషన్ కార్యనిర్వహక వర్గం నిర్ణయం ప్రకారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అసోసియేషన్ సభ్యులందరూ హాజరై న్యాయవాదుల పురోభివృద్ధికి, సంక్షేమానికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

'కమ్మ సంఘం' వనభోజన మహోత్సవం


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమ్మ మహాజన సంఘం నాయకులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని హనుమాన్ టెంపుల్ వద్ద ఉన్న రథంగుట్ట అర్బన్ పార్క్‌లో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, వైస్ ఎంపీపీ కేవీ రావు, పట్టణ ప్రముఖులు దండా రాధాకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం పలువురు కుల ప్రజాప్రతినిధులను సంఘ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కమ్మ మహాజన సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమ్మ మహజన సంఘం గౌరవ సభ్యులు నామా వెంకటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, అధ్యక్షుడు వీరపనేని చెన్నకేశవులు, మల్లిడి లోకేశ్వరరావు, కోశాధికారి యలమాటి పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షులు దొడ్డ తిరుపతిరావులతోపాటు నాయకులు డి.హరి, జె వెంకటేశ్వరరావు, టి.సతీష్, పి.శ్రీను, ఎం.యాదగిరి, పి.శంకర్, ఎస్.వెంకటేశ్వరరావు, రాంగోపాల్, పి.భాస్కర్, ఎస్.రమేష్, టి.రాము, అప్పారావు, జి.కోటేశ్వరరావు, ఎస్.శ్రీను, ఎం.రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

ములకలపల్లి: మండల కేంద్రంలోని రైతువేదిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంపిణీ చేశారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ఎంపీటీసీలు శనగపాటి మోహరమణి, నూపా సరోజిని, మడకం విజయ, తాటి తులసి, సున్నం సునిత, కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, వివిధ శాఖల అధికారులు, పలువురు చర్చి పాస్టర్లు, మతపెద్దలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ..

లయన్స్ క్లబ్ ఆఫ్ కిన్నెరసాని, పాల్వంచ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఆరుద్ర సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాయల కేధారేశ్వరరావు, సెక్రటరీ రేపాక ప్రసాదరావు, శిశుమందిర్ ప్రధానాచార్యులు జగన్. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, కుంజా శ్రీనివాసరావు, మడకం చిరుమప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ప్రభుత్వం క్రైస్తవులకు మంజూరు చేసిన దుస్తులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రెండు మండలాలకు చెందిన అధికారులు, నాయకులు తహసీల్దార్లు జగదీశ్వర్‌ప్రసాద్, సాదియా సుల్తాన, ఎంపీడీఓలు అన్నపూర్ణ, రేవతి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, పర్సా వెంకట్, భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, దార వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుండాల: ప్రభుత్వం అందించిన క్రిస్మస్ కానుకలను ఆదివారం స్థానిక ఏసు క్రీస్తు సమాజ మందిరంలో పాస్టర్ జయరాజ్ అధ్యక్షత ఎంపీపీ ముక్తి సత్యం అందించారు. కేక్ కట్ చేసి క్రీస్తు ప్రేమలను వివరించారు. గుండాల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు ఇర్ప ఏసేపు, ఈసం శాంతయ్య, అరేం శైలజ, ప్రభాకర్, కుంజ రాబర్ట్, సంఘ పెద్దలు అగస్టీన్ ఆనోహు, గోపి, నరసింహారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం అందజేసిన 190 గిఫ్ట్ ప్యాక్‌లను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఆర్ఐలు ఆదినారాయణ, పునెం లక్ష్మయ్య, సర్వేయర్ సున్నం నర్సయ్య, మండల పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.


ములకలపల్లిలో క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


గుండాల: క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ముక్తి సత్యం

లోతువాగుపై వంతెన నిర్మించేనా..?

- ఏడు నెలల క్రితమే శంకుస్థాపన
- నేటికీ ప్రారంభం కాని పనులు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువులో లోతువాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం జరుగుతుందా లేదా అని గిరిజనుల్లో అయోమయం నెలకొంది. తుమ్మలచెరువు గ్రామంలో లోతువాగుపై రూ.5కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి గత మే నెల 29న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. గొందిగూడెంలో 7 కోట్లతో ఇసుకవాగుపై వంతెనకు కూడా శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభమై కొసాగుతున్నాయి. లోతువాగుపై వంతెన పనులు మాత్రం ఏడు నెలలుగా శంకుస్థాపనకే పరిమితమయ్యాయి.

పనులు రద్దవుతాయా.. ప్రారంభమవుతాయా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తుమ్మలచెరువు లోతువాగుపై వంతెన పనులు ప్రారంభమవుతాయా.. లేక రద్దు అవుతాయా అని స్థానిక గిరిజనులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరై పనులు ప్రారంభం కాని వాటి విషయంలో ప్రస్తుతం పనులు చేపట్టవద్దని ప్రభుత్వం సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో నిధులు మంజూరై కొనసాగుతున్న పనులు యథావిధిగా కొనసాగనున్నట్టు సమాచారం. ఆ చొప్పున ఇంకా పనులు ప్రారంభం కాని ఈ తుమ్మలచెరువు విషయంలో నిలిచిపోయినట్టేనా అని సందేహాలు వ్యక్తమవతున్నాయి.


తుమ్మలచెరువు వద్ద లోతువాగు ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు (ఫైల్)

వర్షాకాలంలో గిరిజనుల ఇబ్బందులు

ప్రతి ఏడాది వర్షాకాలంలో లోతువాగు పొంగి ప్రవహించి తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీలలోని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గిరిజనులకు రాకపోకలు నిలిచి ఇబ్బందులు పడతారు. ఎన్నో ఏళ్లుగా వర్షాకాలంలో వారు ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నారు. కనీసం అత్యవసర వైద్య పరిస్థితుల్లోనూ వారికి రవాణా సౌకర్యం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో హైలెవల్ వంతెన నిర్మించాలని గిరిజనులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. చివరకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో రానున్న వర్షాకాలంలోనూ గిరిజనులు అవే కష్టాలు ఉండనున్నాయి. ప్రభుత్వం స్పందించి వంతెన పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది

లోతువాగుపై వంతెనకు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు అయ్యాయి. కానీ అప్పటికి పనులు మొదలవ్వలేదు. ప్రస్తుతం ప్రభుత్వం.. గతంలో నిధులు మంజూరై ప్రారంభమైన పనులు, ప్రారంభం కాని పనులపై నివేదిక కోరింది. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. ఇసుకవాగుపై ఎస్‌డీఎఫ్‌లో నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. లోతువాగుపై వంతెన పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

– వెంకటేశ్వరరావు, ఈఈ, ఆర్అండ్‌బీ